క్లుప్తంగా

విలువలతో విధులు నిర్వహించండి



ప్రిన్సిపల్ శ్రీనివాసులును సన్మానిస్తున్న మీడియా బృందం

సత్యవేడు: ప్రభుత్వ ఉద్యోగులు విలువలతో కూడిన విధులు నిర్వహించాలని ఉపాధ్యాయులు, ఉద్యోగులకు సంఘంలో గుర్తింపు, గౌరవం ఉంటుందని ఎంఈఓ కే.రవి అన్నారు. గురువారం జోతిరావ్‌పూలే బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులును సత్యవేడు ప్రింట్ మీడియా సభ్యుల బృందం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎంఈఓ రవి మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా పాఠశాల అభివృద్ధికి, ఉత్తమ ఫలితాల సాధించడంలో ఆయన కృషి ఎనలేనిదన్నారు. కార్యక్రమంలో ప్రింట్ మీడియా సభ్యులు శ్రీనివాసరావు, రామచంద్రయ్య, సలీం, నాగరాజు, సోము, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వెండి కవచానికి రూ.2.5 లక్షల విరాళం



నగదు అందిస్తున్న పొన్నారావు కుటుంబ సభ్యులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని బహదూరుపేటలో వెలసిన నల్లగంగమ్మకు ఏర్పేడుకు చెందిన నైనారు పొన్నారావు, కుమారులు బాలాజీ, డాక్టర్ పృథ్వి కుటుంబ సభ్యులు గురువారం రూ.2.5 లక్షల విలువ చేసే వెండి కవచాని విరాళంగా అందజేశారు. ఆలయ చైర్మన్ కంఠా రమేష్‌కు అందజేయగా.. ఆయన దాతలకు కృతజ్ఞతలు తెలియజేశారు. సభ్యులు కృష్ణమూర్తి, దిలీప్, అనిల్, యాదగిరి, అర్చకులు గుణ, శంకయ్య పాల్గొన్నారు.

షార్ ఉద్యోగులకు అభినందనలు



రాజులపాలెంలో ఏర్పాటు చేసిన బ్యానర్

ఏర్పేడు: మండలంలోని రాజులపాలెంలో శ్రీహరికోట కేంద్రంలోని షార్‌లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు గురువారం గ్రామంలో యువకులు బ్యానర్లు ఏర్పాటుచేసి అభినందనలు తెలిపారు. షార్‌లో రాజులపాలెం గ్రామానికి చెందిన అంకయ్య సెక్షన్ ఎగ్జిక్యూటివ్, సుబ్రమణ్యం సెక్షన్ టెక్నీషియన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. చంద్రయాన్-3, ఆదిత్య ఎల్-1 విజయవంతం కావడానికి కృషిచేసిన వారిలో గ్రామానికి చెందిన ఇద్దరు ఉండడం గర్వకారణమని చెప్పారు.

అవ్వాతాతలను మురిపించెన్

- ముంగిట్లోకే సామాజిక పింఛన్లు
- వృద్ధులకు తప్పిన తిప్పలు
- అర్హతే ప్రామాణికంగా కొత్త పింఛన్ల మంజూరు



కొత్త పింఛన్లను అందజేస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి (ఫైల్)

శ్రీకాళహస్తి: గతంలో సామాజిక పింఛను అంటే పడిగాపులే.. ఇచ్చే రూ.వందో రెండొందలో పింఛను ఎపుడు ఇస్తారో తెలియదు. రోజుల తరబడి పంచాయతీ కార్యాలయాల వద్ద నిరీక్షించాల్సిందే. జన్మభూమి కమిటీలను ప్రసన్నం చేసుకోవాలి. లేకుంటే పాత పింఛనుదారు ఎవరైనా మరణిస్తే, ఆ స్థానంలో కొత్త పింఛన్లు మంజూరయ్యేవి. జగనన్న సర్కార్ పింఛను విధానాన్ని పూర్తిగా మార్చేసింది. ఇల్లిల్లూ వెదికి, తలుపు తట్టి మరీ పింఛను అందిస్తోంది. ఉద్యోగులకైనా జీతం ఒక రోజు ఆలస్యం అవుతుందో ఏమోకానీ వృద్ధులకు మాత్రం ఠంఛనుగా ఒకటో తేదీనే ఇంటి వద్దకు వచ్చి పింఛను పంపిణీ చేస్తోంది. దీంతో వృద్ధులు ఎంతో ఆనందంగా ఇంటి దగ్గరే పింఛను తీసుకుని కుటుంబంలో గౌరవంగా బతుకుతున్నారు.

శ్రీకాళహస్తి నియోజకవర్గానికి సుమారు 40వేల పింఛన్లు అందుతున్నాయి. నియోజకవర్గ ఓటర్లు 2 లక్షలు ఉండగా అందులో 25 శాతం మంది వృద్ధాప్య, వితంతు, ఒంటరి మహిళ, దివ్యాంగ పింఛన్లు పొందుతున్నారు. ఈ నెల వైఎస్సార్ వర్ధంతిని పురస్కరించుకుని మరో వెయ్యికి పైగా నూతనంగా పింఛన్లు మంజూరు కావడం విశేషం. రాబోయే జనవరికి పింఛను మొత్తం రూ.3 వేలుకు ఇచ్చేలా ముఖ్యమంత్రి ప్రణాళిక రూపొందించారు. ఈ కొత్త పింఛన్లకు పార్టీలు, కులాలు, మతాలు, ప్రాంతాలు అనే బేధం లేకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పింఛను అందేలా చేసి ఆయన ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. గతంలో చంద్రబాబునాయుడు జన్మభూమి కమిటీలు పెట్టి తమ పార్టీకి చెందిన వారికి ప్రాధాన్యత కల్పించేవారు. కులం, మతం ప్రాతిపదికన విభజించి వృద్ధాప్య పింఛన్ల మంజూరుకు లంచాలు ఇచ్చుకోవాల్సిన పరిస్థితి ఉండేది.

ఇంటికి వచ్చి పింఛను ఇచ్చారు



ఒకరోజు ఇంటికి వలంటీరు వచ్చాడు. పెద్దాయనా మీ వయసు 60 ఏళ్లు పూర్తయిందా అని అడిగారు. అవునని చెప్పా. ఆధార్‌కార్డు ఇస్తే పింఛనుకు దరఖాస్తు చేస్తానన్నాడు. ఆ తరువాత నాకు పింఛను మంజూరైందని వలంటీరు ఇంటికి వచ్చి తెలిపాడు. శ్రీకాళహస్తి మండల కార్యాలయానికి వస్తే ఎమ్మెల్యే చేతులమీదుగా ఇస్తామని తెలిపారు. గతంలో పింఛను రావాలంటే అధికారులు, కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. నేడు ఇంటికి వచ్చి పింఛను ఇచ్చారు.

–తోనాటి రఘురామయ్య, ఎగువవీధి, శ్రీకాళహస్తి

జగన్‌కు రుణపడి ఉంటాం



నా భర్త చనిపోయి పుట్టెడు దుఃఖంలో ఉంటే, కుటుంబాన్ని పోషించడం కష్టమైంది. నాకు వితంతు పింఛను కోసం ఎవరిని సంప్రదించాలో తెలియదు. అయితే సురక్ష పథకం ద్వారా నా భర్త మరణ ధృవీకరణ పత్రం అందజేసి వెంటనే వితంతు పింఛను కోసం దరఖాస్తు చేశారు. వలంటీరు 1వ తేదీ ఉదయం ఇంటికి వచ్చి రూ.2.750 పింఛను అందజేశాడు. ఇంటికి పెద్దదిక్కులా మారి జగన్‌బాబు మా గౌరవాన్ని కాపాడారు. ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటాం.

–ఎస్ లక్ష్మి, వాగివేడు, శ్రీకాళహస్తి

వివక్ష లేకుండా పింఛను



మా గ్రామంలో అన్ని పార్టీల వారు ఉన్నారు. అయితే పింఛను పంపిణీలో మాత్రం ఎవరూ నీది ఏ పార్టీ అడిగలేదు. 60 ఏళ్ల వయసు ఉందా లేదా అన్ని మాత్రమే అడిగారు. ఆధార్ కార్డులో ఉన్న వయసు ప్రకారం పింఛన్లు మంజూరు చేశారు. కొత్త పింఛన్లు కూడా అర్హత ప్రకారం అందజేస్తున్నారు. అదీ ఒకటో తేదీ ఉదయమే జీతం వచ్చినట్లు వస్తోంది. గతంలోలాగా ప్రభుత్వ కార్యాలయాలు, రాజకీయ నాయకుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా పోయింది.

–మునిరెడ్డి, ఊరందూరు, శ్రీకాళహస్తి

పౌష్టికాహార లోపంతో రక్తహీనత



సమావేశంలో మాట్లాడుతున్న రత్నమ్మ

ఏర్పేడు: పౌష్టికాహార లోపం వల్ల గర్భిణుల్లో రక్తహీనత సమస్య ఎదురవుతుందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రత్నమ్మ తెలిపారు. మండలంలోని పంగూరు అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం అందజేస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందన్నారు. పిల్లల్లో అనీమియా నివారణకు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు లక్ష్మీప్రసన్న, నారాయణ, రాజ్యలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకుడు పోలయ్య, ప్రజాప్రగతి ట్రస్ట్ మండల కన్వీనర్ చంద్రశేఖర్, ప్రగతి సంస్థ మండల కన్వీనర్ శిరీషా, అంగన్‌వాడీ కార్యకర్తలు రోహిణీ కుమారి, మీనాక్షి, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో మంచి ఆరోగ్యం



ప్రసంగిస్తున్న వైద్యాధికారి లావణ్య

వరదయ్యపాళెం: పౌష్టికాహారంతో మంచి ఆరోగ్యం సాధ్యమని చిన్నపాండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి లావణ్య తెలిపారు. పౌష్టికాహార వారోత్సవాల్లో భాగంగా గురువారం మండలంలోని పాండూరు హైస్కూల్‌లో శ్రీసిటీలోని ప్రముఖ చాక్లెట్ పరిశ్రమ మోండలెజ్ సేవ్ ది చిల్డ్రన్స్ సంస్థ, పీహెచ్‌సీ వారు సంయుక్తంగా అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వైద్యాధికారి లావణ్య ఆరోగ్యకరమైన జీవన విధానాలపై అవగాహన కల్పించారు. పౌష్టికాహార లోపం వల్ల పలు వ్యాధులకు గురయ్యే అవకాశం ఉందన్నారు. చిరుధాన్యాలతో కూడిన పౌష్టికాహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ముఖ్యంగా పిల్లలకు పౌష్టికాహారం అందించాలని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విమలకుమారి, సేవ్ ది చిల్డ్రన్స్ సంస్థ కో-ఆర్డినేటర్ హేమంత్, సూపర్‌వైజర్లు కిరణ్‌కుమారి, రాజేష్, సుబ్రమణ్యం, తులసి పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేద్దాం



న్యాయమూర్తి బేబీ రాణి

శ్రీకాళహస్తి: పట్టణంలోని న్యాయస్థాన భవనంలో 9వ తేదీ శనివారం నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేద్దామని సీనియర్ సివిల్ జడ్జి బేబీరాణి అన్నారు. ఈ మేరకు గురువారం న్యాయమూర్తి మాట్లాడుతూ సెప్టెంబరు 9న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను వినియోగించుకుని కేసుల నుంచి ఉపశమనం పొందాలని సూచించారు. రాజీయే రాజమార్గంగా భావించి, లోక్ అదాలత్ ద్వారా అధిక సంఖ్యలో కేసులు పరిష్కరించుకోవచ్చని చెప్పారు.

ఇద్దరిపై కేసు నమోదు

ఏర్పేడు: మండలంలోని పాతవీరాపురంలో మహిళపై దాడి చేసిన ఘటనలో ఇద్దరిపై గురువారం కేసు నమోదు చేశారు. ఏర్పేడు సీఐ శ్రీహరి కథనం మేరకు, మండలంలోని పాత వీరాపురం గ్రామానికి చెందిన వసంతమ్మ ఇంటిలో ఉండగా అదే గ్రామానికి చెందిన మునిశేఖర్, పుష్ప దాడి చేసి గాయపరిచారు. చికిత్స కోసం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించి ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

అభివృద్ధి పనులకు సహకరించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

- అంబేడ్కర్ భవనం, గిడ్డంగి ఏర్పాటుకు తొలగిన అడ్డంకులు
- మస్తాన్ రిట్ పిటిషన్‌ను డిస్మిస్ చేసిన హైకోర్టు

సత్యవేడు: నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు అఖిలపక్షం నాయకులు సహకరించాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కోరారు. గురువారం సత్యవేడు అటవీ అతిథిగృహంలో నిర్వహించిన ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సత్యవేడు- ఊత్తుకోట మార్గంలోని తెలుగుగంగ స్థలం సర్వే నంబరు 352-8ఏలో 1.10 సెంట్లలో అంబేడ్కర్ భవనానికి 60 సెంట్లు, వ్యవసాయ గిడ్డంగికి 50 సెంట్లు కేటాయిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు. ఆ స్థలం తనదేనంటూ మాజీ ఎంపీపీ వి.మస్తాన్(తెలుగుదేశం) హైకోర్టులో రిట్ పిటీషన్ వేశారు. దీంతో రెండు భవన నిర్మాణాలకు నిధులు మంజూరైనా పనులు చేపట్టేందుకు అడ్డంకిగా మారింది. మస్తాన్ వేసిన రిట్ పిటీషన్‌ను కొద్దిరోజుల క్రితం హైకోర్టు డిస్మిస్ చేసిందని, ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు వచ్చిందని ఎమ్మెల్యే తెలిపారు. భారత రాజ్యాంగాన్ని రచించిన అంబేడ్కర్ పేరున నిర్మించే భవనానికి ఆక్రమణదారులు ఎన్ని అడ్డంకులు సృష్టించినా చివరకు న్యాయమే గెలిచిందన్నారు. దాసుకుప్పం బైపాస్ రోడ్డు ఏర్పాటుకు రూ.26 కోట్లు మంజూరైనట్లు ఆయన చెప్పారు. భూసేకరణకు రూ.6 కోట్లు, రోడ్డు ఏర్పాటుకు రూ.20 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. బైపాస్ రోడ్డు ఏర్పాటుకు స్థానిక రైతులు సహకరించాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో తహసీల్దారు షేక్ జరీనా బేగం, సీఐ శివకుమార్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి కే.చంద్రశేఖర్ రెడ్డి, సురుటుపల్లి ఆలయ చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబరు బందెల సురేష్ (వరదయ్యపాళెం), మండల కన్వీనర్ అపరంజిరాజు (నాగలాపురం), సచివాలయ మండల కన్వీనర్ చిన్నా (వరదయ్యపాళెం), వైఎస్సార్‌సీపీ నాయకులు ఈ.గోవిందస్వామి, శ్యాంప్రసాద్ రెడ్డి, మునివేలు, రవి, రమణ, శ్రీరాములు రెడ్డి, పునిదకుమార్, శ్రీనివాసులు రెడ్డి, జోసెఫ్, పళణి, రాబిన్ పాల్గొన్నారు.

మిత్ర పురుగుల నిష్పత్తి ఎక్కువగా ఉండాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ హేమలత

కార్వేటినగరం: పంట సస్యరక్షణలో దిగుబడికి దోహదం చేసే మిత్ర పురుగులు అధికంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఏఓ హేమలత అన్నారు. గురువారం మండలంలోని డీఎంపురం ఆర్బీకే పరిధిలోని కేఎంపురం గ్రామ సమీపంలో రైతులకు పొలంబడి కార్యక్రమం నిర్వహించి ఖరీఫ్ సీజన్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ పంట సాగులో శత్రు పురుగుల కన్నా మిత్ర పురుగులు అధికంగా ఉంటే ఎటువంటి సస్యరక్షణ చర్యలు అవసరం లేదన్నారు. లింగకర్షక బుట్టలు, పసుపు జిగురు పళ్లాలు సమగ్ర పంట సస్యరక్షణ ప్లాట్‌లో ఉంచడం వల్ల కాండం తొలుచు రెక్కపురుగులు, ఆకుముడత రెక్కపురుగు, సుడిదోమ లాంటి శత్రు పురుగులు ఉధృతిని గమనించి సస్యరక్షణ చర్యలు చేపట్టవచ్చన్నారు. అనంతరం రైతులకు సస్యరక్షణపై ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈఓలు గాయత్రి, హేమాద్రి, ఆర్బీకే సిబ్బంది మునికృష్ణ, కుసుమ, ప్రసన్న, రైతులు దాముర్రెడ్డి, నటరాజరెడ్డి, సోమశేఖర్, భూపాల్, రాజేష్, సంపత్‌రెడ్డి పలువురు పాల్గొన్నారు.

పనులు వేగవంతం చేయండి



పనులను పర్యవేక్షిస్తున్న పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయం సమీపంలోని భరద్వాజ తీర్థం రోడ్డు పనులు వేగవంతం చేయాలని పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు అన్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయం ఆధ్వర్యంలో రూ.1.36కోట్లతో ఈ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణాల పనులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో గురువారం చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు ఆ పనులను పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ ఇంజినీరింగ్‌శాఖ అధికారులు ఈఈ నూకరత్నం, వర్క్ ఇన్‌స్పెక్టర్ ప్రతాప్, కాంట్రాక్టరు రాఘవరెడ్డి ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ప్రభుత్వంలో అర్హతే ప్రామాణికం



పింఛన్లు అందజేస్తున్న మండల ఇన్‌చార్జి బియ్యపు పవిత్రారెడ్డి

తొట్టంబేడు(శ్రీకాళహస్తి): జగనన్న ప్రభుత్వంలో అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారులకు పింఛన్లు అందిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జి బియ్యపు పవిత్రారెడ్డి అన్నారు. తొట్టంబేడు మండల ఎంపీడీవో కార్యాలయంలో గురువారం కొత్తగా 155 మందికి పింఛన్లు పంపిణీ ఆమె చేతులమీదుగా అందజేశారు. ఆమెకు తొట్టంబేడు ఎంపీపీ ఉన్నం నిర్మలమ్మ శాలువ కప్పి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పింఛన్ తీసుకోవాలంటే ఊర్లో ఎవరో ఒకరు చనిపోతే గానీ కొత్త పింఛను ఇచ్చేవారు కాదని గుర్తుచేశారు. ఇప్పుడు మన జగనన్న ప్రభుత్వం అలా కాకుండా అర్హత ఉన్న ప్రతి ఒక లబ్ధిదారుకు తలుపు తట్టి మరీ పింఛన్లు అందజేస్తోందని తెలిపారు. రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ మన జగనన్న ప్రభుత్వం ప్రతి పథకాన్ని అందజేస్తోందని వివరించారు. గ్రామంలో ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో పింఛన్‌దారులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో తొట్టంబేడు ఎ మండల కన్వీనర్ ఉన్నం వాసుదేవ నాయుడు, జెడ్పీటీసీ అర్చనాదేవి, నాయకులు మునిరత్నం, కన్నలి భాస్కర్ రెడ్డి, కో-ఆప్షన్ మెంబర్ ప్రేమ, కొన్నలి రమేష్, ఎంపీటీసీ సభ్యులు గురుస్వామి నాయుడు, నరసింహులు, రవీంద్ర నాయుడు, గురుమూర్తి, సుబ్రమణ్యం, సర్పంచ్‌లు వెంకటరమణారెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, సుబ్రమణ్యం, కృష్ణమూర్తి, మండల అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బృందావనమాలి.. రారా మా ఇంటికి ఒకసారి..







వీరరాఘవస్వామి ఆలయంలో సామూహిక గీతాపారాయణంలో భక్తులు, స్వామివారికి ఊంజల్‌సేవ నిర్వహిస్తున్న భక్తులు, సప్తగోకులంలో పూజలు చేస్తున్న పాలకమండలి చైర్మన్ తారకశ్రీనివాసులు

నారాయణవనం: బృందావనమాలి.. రారా మా ఇంటికి ఒకసారి..అంటూ భక్తులు ఆలపించిన గీతాలు ఆహుతులను అలరించాయి. మండలవ్యాప్తంగా గోకులాష్టమిని గురువారం ఘనంగా జరుపుకున్నారు. స్థానిక వీరరాఘవ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సామూహిక గీతాపారాయణం చేశారు. గోకులాష్టమితో పాటు ప్రతి శనివారం ఆలయంలో గీతాపారాయణం నిర్వహిస్తున్నట్లు పాలక మండలి సభ్యులు చెప్పారు. స్థానిక పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం సాయంత్రం బాలకృష్ణుడి విగ్రహాన్ని ఊంజల్‌మండలంలో ఉంచి ఆస్థానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మాట్లాడుతూ శుక్రవారం ఉదయం మాడవీధుల్లో శ్రీకృష్ణుని ఊరేగింపు అనంతరం ప్రత్యేక తిరుమంజనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సాయంత్రం ఉభయనాంచారుల సమేత కల్యాణ వెంకన్నతో కలిసి మాడవీధుల ఊరేగింపు అనంతరం ఉట్లోత్సవంలో పాల్గొంటారని చెప్పారు.

వరదయ్యపాళెంలో..

వరదయ్యపాళెం: మండలంలోని అంబికాపురంలో గల శ్రీకృష్ణాశ్రమంలో గురువారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆశ్రమంలోని స్వామివారి విగ్రహానికి ప్రత్యేక అలంకరణ చేసి అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు సహపంక్తి భోజనాలను ఏర్పాటు చేశారు. ఆశ్రమ నిర్వాహకులు బంగారు నాయుడు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. రాత్రి స్వామివారికి ఊంజల్‌సేవ నిర్వహించగా పెద్దసంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

ఘనంగా గోకులాష్టమి వేడుకలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయం ఆధ్వర్యంలో గురువారం గోకులాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయంలోని బిక్షాల గాలిగోపురం వద్ద ఉన్న సప్తగోకులం, దక్షిణ గాలిగోపురం వద్ద ఉన్న సప్తగోకులం, భరద్వాజతీర్థంలో ఉన్న గోశాలలో గోమాతలకు సంప్రదాయ పూజలు నిర్వహించారు. గోశాలలో ఉన్న గోవులకు విశేష అలంకారాలు చేసి పూజలు చేశారు. అనంతరం గోమాతలకు నైవేద్యం సమర్పించారు. పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు మాట్లాడుతూ గోమాతలను పూజిస్తే ముక్కోటి దేవతలను పూజించిన ఫలం దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు వెంకటసుబ్బయ్య, నూకరత్నం, కృష్ణారెడ్డి, సురేష్‌రెడ్డి, సుదర్శన్‌నాయుడు, ఆలయ వేదపండితులు, అర్చకులు తితరులు పాల్గొన్నారు.



విశ్వభారతి పాఠశాలలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు

శ్రీకాళహస్తిలో ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి: ఆది గురువు అయిన శ్రీకృష్ణుని జన్మదినం సందర్భంగా శ్రీకృష్ణ చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు మల్లెంబాకం మునికృష్ణారెడ్డి ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఆయన మాట్లాడుతూ శ్రీకృష్ణ జయంతి విశిష్టతను వివరించారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీపతిరెడ్డి, కల్యాణ్‌కుమార్‌రెడ్డి, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి: పట్టణంలోని పలు పాఠశాలల్లో శ్రీకృష్ణాష్టమి వేడుకలను గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని విక్రమ్ సక్సెస్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో నిర్వహించిన వేడుకల్లో విద్యార్థులు కృష్ణుడు, గోపికలు వేషధారణలతో అలరించారు. కరస్పాండెంట్ మునిలక్ష్మి కృష్ణాష్టమి విశిష్టతను వివరించారు. విశ్వభారతి పాఠశాలలోనూ కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ శోభ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఏర్పేడు: స్థానిక గుంటకట్టపై గురువారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. ఏర్పేడు, ఆమందూరు గ్రామాలకు చెందిన యాదవ సంఘాల నాయకులు శ్రీకృష్ణుని చిత్రపటానికి పూలమాల వేసి పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. మాజీ సర్పంచ్ మునిరామయ్య, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

గుత్తివారిపల్లెలో..

రేణిగుంట: కృష్ణాష్టమిని పురస్కరించుకుని మండలంలోని పలు ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. మండలంలోని గుత్తివారిపల్లిలో, గాజులమండ్యం పంచాయతీ బాలాజినగర్లో ఉన్న రాధాకృష్ణ ఆలయాల్లో రాధాకృష్ణులను విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు దర్శించి మొక్కులు తీర్చుకున్నారు. చిన్నారులు చిన్ని కృష్ణుడి వేషధారణలో ఉత్సవాల్లో పాల్గొన్నారు. గుత్తివారిపల్లెలో సింగిల్‌విండో అధ్యక్షుడు గణేష్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేయించి భక్తులకు అన్నదానం చేశారు.







అన్నదానం చేస్తున్నమునికృష్ణారెడ్డి తదితరులు, విక్రమ్ పాఠశాలలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు, గుత్తివారిపల్లిలో రాధాకృష్ణులకు ప్రత్యేక పూజలు చేస్తున్న సింగిల్‌విండో అధ్యక్షుడు గణేష్‌రెడ్డి

గ్రామోత్సవంలో అవనాక్షమ్మ



పురవీధుల్లో భక్తులను కటాక్షిస్తున్న అవనాక్షమ్మ అమ్మవారు

నారాయణవనం: మండలంలోని సముదాయంలో వెలసిన టీటీడీ అనుబంధంగా ఉన్న అవనాక్షమ్మ ఆలయ వార్షిక ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి అమ్మవారు పురవీధుల్లో విహరించారు. ఉదయం ఆలయంలో అర్చకులు నిత్య పూజా కైంకర్యాలను పూర్తి చేశారు. అనంతరం అమ్మవారికి సర్కారు అభిషేకం నిర్వహించి, సుగంధ పుష్పాలతో సుందరంగా అలంకరించారు. పరిసర గ్రామాల మహిళలు పొంగళ్లు పెట్టి, పిండి దీపాలతో నైవేద్యం సమర్పించారు. సాయంత్రం అమ్మవారు సముదాయం, నారాయణవనం పురవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఈ సందర్భంగా మహిళలు హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఈకార్యక్రమాల్లో టీటీడీ స్థానిక ఆలయాల ఏఈఓ పార్థసారథి, సూపరింటెండెంట్ ఏకాంబరం, ఆలయ అధికారి నాగరాజు, భద్రతా జమేదార్ రాజశేఖర్ పాల్గొని పర్యవేక్షించారు. జాతరలో చివరి రోజైన శుక్రవారం ఉదయం 5 గంటలకు అమ్మవారికి ప్రత్యేక అభిషేకం నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారి నాగరాజు, అర్చకులు పన్నీర్‌సెల్వం తెలిపారు. సాయంత్రం విశేష అలంకరణలో అమ్మవారు సముదాయం, కీళగరం, నారాయణవనం పురవీధుల్లో విహరిస్తారని చెప్పారు.